సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ

అన్నమయ్య జిల్లాలో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. నాయకులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. - 8లో



వైభవం.. గంధోత్సవం

వైఎస్సార్ జిల్లా కమలాపురంలోని హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాలో మంగళవారం రాత్రి గంధోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.190
రెండోరకం	రూ.100	రూ.140



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 198 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	250	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 518.600 కిలోలు

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్ జిల్లాకు సీఎం వైఎస్ జగన్ రాక



పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందులకు రానున్నారు. భాకరాపురంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన స్థానిక సీఎస్ఐ చర్చి మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడి నుంచి భాకరాపురంలోని తన స్వగృహానికి చేరుకుని అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి సర్వమత ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా అంబకపల్లె రోడ్డులో గల మినిసెక్రటేరియట్‌లోని ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుని అక్కడ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున గత సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ఒక సెట్ నామినేషన దాఖలు చేసిన విషయం తెలిసిందే.

కర్ణాటక ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలు–2024 నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో కార్మికులుగా పనిచేస్తున్న కర్ణాటక ఓటర్లకు ఏప్రిల్ 26, మే 7వ తేదీలలో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని జిల్లాలోని ప్రైవేటు సంస్థలకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ప్రైవేటు సంస్థలకు అందజేసిన ఆదేశాలను పత్రికలకు విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 135(బీ) ప్రకారం కార్మికులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఏప్రిల్ 26న, మే 7న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న కర్ణాటక ఓటర్లకు ఆయా నియోజకవర్గాల వారీగా సంబంధిత తేదీలలో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆ ఆదేశాలలో కలెక్టర్ పేర్కొన్నారు.

మదరసాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న మదరసా ప్రిన్సిపల్

రాయచోటి టౌన్: మదరసా ఏ దారుల్ ఉలూమా ఇమ్‌దాదియాలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మదరసా ప్రిన్సిపల్ ముఫ్తి సయ్యద్ మాసూమ్ సాఖిబ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. దారుల్ ఉలూమ్ ఇమ్‌దాదియా మదరసాలో నూరానీ – ఖాయిద, నాజిర ఖురాన్, హిఫ్జ్, పార్సీ, దరసె నిజామి, మౌల్వీ కోర్సులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, వైద్య, బస సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. దీనియాత్ చదివే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిలబస్ ప్రకారం హైస్కూల్ వరకు ఓపెన్ స్కూల్ విద్యాబోధన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9441432607, 9030272740, 8500962886, 9160746484 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలింగ్ రోజు సెలవు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్మికశాఖ దుకాణాలు, సంస్థల చట్టం–1988 ప్రకారం మే 13న రాష్ట్ర శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఓటుహక్కు వినియోగించుకునేందుకు కార్మిక కమిషనర్ సెలవు ప్రకటించారని జిల్లా కార్మికశాఖ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఓటు వేసేందుకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలన్నారు.

నేడు జనరల్ అబ్జర్వర్లు వైఎస్సార్ జిల్లాకు రాక

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వైఎస్సార్ జిల్లా కోసం నియమించిన ఇద్దరు జనరల్ అబ్జర్వర్లు బుధవారం జిల్లాకు రానున్నారు. కడప, పులివెందుల, కమలాపురం శాసనసభ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా 2011 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కునాల్‌సిల్కును నియమించారు. లైజన్ అధికారిగా కడప మండల వ్యవసాయాధికారి ఎస్వీ సురేష్‌కుమార్‌రెడ్డి (సెల్ 8331057317)ని నియమించారు. బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు శాసనసభ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి భానుదాస్ పలావేను నియమించారు. లైజన్ అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వ్యవసాయాధికారి జి.లక్ష్మణకుమార్‌ను నియమించారు. పోలీసు జనరల్ అబ్జర్వర్‌గా ఐపీఎస్ అధికారి అర్జిత్‌సేన్ ఠాకూర్ బుధవారం రానున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- పోలీసులతో ప్రత్యేక బందోబస్తు
- గ్రామాల్లో అనుమానాస్పద, కేసులున్న వారి పట్ల అప్రమత్తం
- 5400 మంది వివిధ పార్టీలకు చెందిన వారు బైండోవర్
- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు
- జిల్లాలో లైసెన్స్ తుపాకులు స్వాధీనం
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- పోలింగ్ రోజు ఘర్షణలు జరగకుండా ప్రత్యేక ప్రణాళిక
- 'సాక్షి'తో అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు

సాక్షి ఇంటర్వ్యూ



సాక్షితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు

సాక్షి రాయచోటి: ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా గొడవలు జరగకుండా పోలింగ్ రోజు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆరు నియోజకవర్గాల్లో సుమారు 1500 మందితోపాటు మిలిటరీ, సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, ఇతర బలగాలను బందోబస్తుకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతోపాటు కేసులున్న వారి పట్ల నిరంతరం నిఘా కొనసాగిస్తూనే రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రశాంత వాతావరణానికి కృషి చేస్తున్నాం. అక్రమంగా జిల్లాలోకి నగదు, మద్యం ప్రవేశించకుండా 15 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. పలు పార్టీలకు చెందిన 5400 మందిని బైండోవర్ చేశాం. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ తుపాకులను ఎన్నికల నేపథ్యంలో రికవరీ చేశాం.. అని అన్నమయ్య జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నాయకులతో మాట్లాడుతున్నాం. వీటితోపాటు ఎక్కడైనా సమస్య ఏర్పడుతుందన్న అనుమానం ఉన్న గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్, సెర్చ్ ఆపరేషన్, ఇతర తనిఖీలు చేపడుతున్నాం. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రధానంగా ఫ్యాక్షన్, ముఠా కక్షలు, వర్గ కక్షలు ఉన్న గ్రామాలను నాలుగు విభాగాలుగా విభజించి అందుకు అనుగుణంగా బందోబస్తు చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా గ్రామాల్లో చదువుకున్న వారితోపాటు గ్రామస్తులకు గొడవల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ చైతన్యవంతులను చేస్తున్నాం.

అక్రమాల నిరోధానికి చెక్‌పోస్టులు

జిల్లాలో అంతర్ రాష్ట్ర, జిల్లాల చెక్‌పోస్టులు సుమారు 15 ఏర్పాటు చేశాం. ఎక్కడికక్కడ ప్రత్యేక స్క్వాడ్ బృందాల ద్వారా వాహన తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటివరకు రూ. 6.21 కోట్ల నగదుతోపాటు అక్రమ మద్యాన్ని సీజ్ చేశాం. చిన్నపాటి సమాచారం వచ్చినా సత్వరమే దాడులు చేస్తున్నాం. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

5400 మంది బైండోవర్

అన్నమయ్య జిల్లాలో ఎక్కడికక్కడ సమస్యాత్మక గ్రామాలను గుర్తించడంతోపాటు వాటిపై నిఘా పెట్టాం. ఘర్షణల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 5400 మందిని బైండోవర్ చేశాం. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో సమస్యలు సృష్టించే వారిని పిలిపించి గట్టిగా హెచ్చరిస్తున్నాం. ఫ్యాక్షన్ గ్రామాలు, వర్గ నాయకులకు సూచనలు చేసి ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. జిల్లాలో పలువురు నేతలు, వర్గ నాయకుల వద్ద ఉన్న తుపాకులను స్వాధీనం చేసుకుంటున్నాం.

50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలో సుమారు 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల నుంచి కంట్రోల్ రూము వరకు ఏం జరుగుతుందో పర్యవేక్షిస్తుంటారు. రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా రిటర్నింగ్ అధికారుల వరకు అందరూ ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తుంటారు. ఎక్కడ అనుమానం వచ్చినా వెంటనే సమాచారం తెప్పించుకుని చర్యలు చేపడుతున్నాం.

భారీగా పోలీసు బందోబస్తు: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలతోపాటు కౌంటింగ్ సెంటర్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 1600 మంది జిల్లాలో పనిచేసే సివిల్ పోలీసులతోపాటు 10 కంపెనీల సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, ఇతర పోలీసులు విధుల్లో ఉంటారు.

పోలీసుల్లో ఆత్మస్థైర్యం నింపేలా..

జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులకు ప్రత్యేక శిక్షణను ఇచ్చాం. ప్రధానంగా వారిలో ఆత్మస్థైర్యం నింపేలా.. అంతేకాకుండా ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను వివరించాం. హోంగార్డు మొదలుకొని డీఎస్పీ స్థాయి వరకు అవగాహన కల్పించాం.

పోలింగ్ రోజు ఘర్షణలకు తావు లేకుండా..

పోలింగ్ కేంద్రాల వద్ద స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లు వేసుకునేలా ప్రజలకు అవకాశం కల్పిస్తాం. ఇప్పటికే జిల్లాలో గతంలో ఎన్నికలు జరిగిన సమయంలో గొడవలు జరిగిన ప్రాంతాలను గుర్తించాం. పోలింగ్ రోజు ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందితోపాటు రూట్ మొబైల్ టీములు ఉంటాయి. ఏదైనా సమస్య ఏర్పడితే అక్కడికి 5–10 నిమిషాల్లో చేరుకునేలా ప్రత్యేక పోలీసు బృందాలు ఉంటాయి. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సెల్ సిగ్నల్ లేని 17 ప్రాంతాలను గుర్తించి అక్కడ వైర్‌లెస్ సౌకర్యం ఏర్పాటు చేశాం.

కేసుల కోసం.. తిరకాసు

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించమని ఒత్తిడి
- అలా కుదరదన్న మద్యం దుకాణదారులను దుర్భాషలాడిన ఎస్ఐ
- పోలీసుల తీరుకు నిరసనగా మద్యం దుకాణాలకు తాళాలు



లక్కిరెడ్డిపల్లె బస్టాండ్ వద్ద మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణం



లక్కిరెడ్డిపల్లి: ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా.. కొనుగోలు చేసినా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులది. అయితే ఇక్కడ పోలీసులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వినియోగదారులకు నిబంధనలకు మించి మద్యం బాటిళ్లు విక్రయించాలని, లేదంటే మీపై తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారు. పోలీసుల వేధింపులు తాళలేక లక్కిరెడ్డిపల్లిలో ప్రభుత్వ మద్యం దుకాణదారులు తమ దుకాణాలకు తాళాలు వేశారు. వివరాల్లోకి వెళితే..

సోమవారం ఇద్దరు మద్యం దుకాణాల సూపర్‌వైజర్లను ఎస్ఐ విష్ణువర్ధన్ లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో వ్యక్తికి మూడుకు మించి మద్యం బాటిళ్లు విక్రయించరాదని, అయితే తాము మందు బాబులపై కేసులు నమోదు చేయాలంటే మీరు మూడుకు మించి మద్యం బాటిళ్లు వారికి విక్రయించాలని చెప్పారు. పోలీసుల సూచనతో ఖంగుతున్న సూపర్‌వైజర్లు తాము ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం బాటిళ్లు విక్రయిస్తామని, అదనంగా ఎవరికీ ఇచ్చేందుకు వీలు లేదని చెప్పారు. దీంతో అగ్గిమీద గుగ్గిలమైన ఎస్ఐ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లను పత్రికల్లో రాయలేని విధంగా దుర్భాషలాడారు. మందు బాబులపై కేసులు పెట్టేలా సహకరించాలని, లేదంటే మీపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపిస్తానంటూ బెదిరింపులకు దిగారు. దీనిపై మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ప్రతి వ్యక్తికి మూడు బాటిళ్లు మాత్రమే ఇవ్వాలనే నిబంధనలు పాటిస్తూ ఉన్నామన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ప్రాంతంలో పోలీసులు వారి ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారని, మందుబాబులకు మూడు బాటిళ్లకు మించి విక్రయిస్తే కేసులు పెట్టుకునేందుకు తమకు అవకాశం ఉంటుందని ఎస్ఐ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం దారుణమని వారు వాపోయారు. పై అధికారుల ఆదేశాల మేరకే తాము మద్యం విక్రయిస్తున్నామని ఎస్ఐకు సమాధానం ఇవ్వబోయినా ఆయన తమపై చిందులేసినట్లు బోరున విలపించారు. తమ ఉద్యోగాలు తాము చేసుకుంటూ ఉంటే మమ్మల్ని బెదిరించడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ కడప డీఎంకు ఫిర్యాదు చేసి మద్యం దుకాణాలను మూసివేస్తున్నామని తెలిపారు. అలాగే లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన సంఘటనను అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ఫోన్ ద్వారా తెలియజేసినట్లు సూపర్ వైజర్లు చెప్పారు.

ఎస్ఐ ఏమన్నారంటే..

ఈ విషయమై లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదని, ఒక్కొక్కరికి ఎక్కువ బాటిళ్లు ఇవ్వకుండా నిబంధనల మేరకు ఇవ్వాలని సూచించామన్నారు. ఎన్నికల వేళ గ్రామాల్లో అల్లర్లు జరగకుండా మద్యం విక్రయాలు తగ్గించమని సూచించామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకే మద్యం దుకాణాల వద్ద తమ సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, చిత్రంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, వేసవిలో విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మొత్తం 5450 హ్యాబిటేషన్స్ ఉన్నాయన్నారు. అందులో ప్రస్తుతం 80 హ్యాబిటేషన్లలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. నీటిసమస్యపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలు, హ్యాబిటేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలోని తాగునీటి పథకాలను పరిశీలించి వీటి ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీరు, షామియానా, ప్రథమ చికిత్స బాక్సు వంటి అన్ని వసతులు ఉండేలా చూడాలని సూచించారు.

ఐదో రోజు.. 30 నామినేషన్లు

జిల్లాలో లోక్‌సభకు 3, అసెంబ్లీలకు 27 నామినేషన్ల దాఖలు



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న బీసీ నాయకుడు వందాడి వెంకటేశ్వర్లు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 5వ రోజు 30 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మంగళవారం రాజంపేట లోక్‌సభ స్థానంతో పాటు 6 అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి.

రాజంపేట లోక్‌సభకు..

1. పి.ప్రదీప్– ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
2. మాదా రాజా– జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ
3. కొండేటి లీలావతి– ఇండియన్ నేషనల్ కాంగ్రెస్

అసెంబ్లీకి 27 నామినేషన్లు: మంగళవారం 5వ రోజున అసెంబ్లీ అభ్యర్థులుగా 27 మంది ఆయా ప్రాంతాలలోని రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్లు దాఖలు చేశారు.

రాజంపేట అసెంబ్లీ స్థానానికి..

1. కాటపాటి సుబ్బమ్మ – ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
2. షేక్ సలాం – ఇండిపెండెంట్
3. ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి – వైఎస్సార్‌సీపీ

కోడూరు(ఎస్సీ)..

1.కె.లక్ష్మీ నరేష్ – ఇండిపెండెంట్
2. కొరముట్ల శ్రీనివాసులు – వైఎస్సార్‌సీపీ
3. చెన్నూరు సుబ్బారావు – ఇండిపెండెంట్
4. అరవ శ్రీధర్ – జనసేన పార్టీ
5. దామర్ల సిద్దయ్య – ఇండిపెండెంట్
6. నగిరిపాటి మహేశ్వర – ఇండిపెండెంట్
7. దేవరపల్లి మురళి – ఇండిపెండెంట్
8. తాళ్లపాక సుబ్రమణ్యం – బహుజన సమాజ్ పార్టీ
9. తిప్పన దుర్గయ్య – ఇండిపెండెంట్
10. రెడ్డి పాగా పెంచలయ్య – బహుజన సమాజ్ పార్టీ
11. గోసుల దేవి – ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ
12. తుమ్మల సురేష్ – ఇండిపెండెంట్

రాయచోటి..

1. గడికోట శ్రీకాంత్‌రెడ్డి – వైఎస్సార్‌సీపీ
2. గుడి మధుసూదన్ – జై భారత్ నేషనల్
3. పఠాన్ మన్సూర్ అలీఖాన్ – ఇండిపెండెంట్
4. అనంతపురం హరికృష్ణ – లిబరేషన్ కాంగ్రెస్

తంబళ్లపల్లి..

1. పోకపట్ల వెంకటరెడ్డి – ఇండిపెండెంట్
2. ఎం.సురేష్ – ఇండిపెండెంట్

పీలేరు: 1. ఆసాది వెంకటాద్రి – ఇండిపెండెంట్

మదనపల్లి

1. ఎస్.జయసింహ – ఇండిపెండెంట్
2. ఎం.భాస్కర్ – జైభారత్ నేషనల్ పార్టీ
3. రాయదుర్గం జనార్దన్ – ఇండిపెండెంట్

రామయ్య రథోత్సవం.. మురిసె భక్తజనం





రథోత్సవానికి హాజరైన లక్షలాది భక్తులు (ఇన్‌సెట్) రథంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణులు

- రామనామ స్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట
- తరలివచ్చిన అశేష భక్తజనం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఒంటిమిట్ట తహసీల్దార్ వై. రమేష్ బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండ రాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కాయకర్పూర నీరాజనాలు అందించారు.

నేడు బ్రహ్మోత్సవాల్లో: శ్రీరాముడి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు బుధవారం ఉదయం 7 గంటలకు కాళీయమర్దన అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిస్తాడు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరుగుతుంది. అనంతరం రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

- 23 నుంచి ఫీజు చెల్లింపు
- 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

రాయచోటి: ఏపీ డీఈఈ సెట్–2024కు సంబంధించి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, రెండేళ్ల ఉపాధ్యాయ కోర్సులో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈనెల 23వ తేదీన ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంది. 24 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి ప్రవేశపరీక్ష కంప్యూటర్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. 2024 సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి అర్హులకు 17 ఏళ్లు నిండి ఉండాలన్నారు. గరిష్ట వయోపరిమితి ఉందన్నారు. దరఖాస్తు రుసుము రూ. 750లు చెల్లించాలన్నారు. మే నెల 8వ తేదీన చెల్లింపునకు, 9న దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందన్నారు. మే నెల 21వ తేదీన ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. 24వ తేదీన పరీక్ష, మే 30వ తేదీన ఫలితాలు వెల్లడవుతాయన్నారు. జూన్ 6వ తేదీ నుంచి 8 వరకు అభ్యర్థులు కళాశాలలు ఎంచుకోవడానికి వెబ్‌సైట్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చన్నారు. 10వ తేదీన అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ప్రభుత్వం డీఎడ్ కళాశాలలను కేటాయిస్తుందన్నారు. జూన్ 12 నుంచి 15 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. జూన్ 20న తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ కంట్రోల్ రూం ఏర్పాటు

రాయచోటి టౌన్ : అక్రమ మద్యం నివారించడానికి అన్నమయ్య జిల్లాలో ఎక్సైజ్ కంట్రోల్ రూం ను ఏర్పాటు చేశామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మెరుగు విజయ్ బాబు మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా అక్రమంగా మద్యం అమ్మినా, సరఫరా చేసినా, అక్రమంగా మద్యం నిల్వలు చేసినా, అక్రమంగా కల్లు అమ్మినా, సుంకం చెల్లించని మద్యం అమ్మినా, ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం అమ్మినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు ప్రజల దృష్టికి వచ్చిన వెంటనే 82470 48853కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

తృటిలో తప్పిన ప్రమాదం



బస్సు అదుపు తప్పిన దృశ్యం

చిన్నమండెం : ఓ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కగా దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు.. మంగళవారం ప్రైవేట్ బస్సు బెంగళూరు నుండి రాయచోటికి వస్తుండగా మండల పరిధిలోని వండాడి గ్రామం తూర్పుపల్లె క్రాస్ వద్దకు వచ్చింది. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి వేగంగా రోడ్డు పక్కగా దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు.

జంటహత్యలపై కేసు నమోదు

చిన్నమండెం : మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామం కమ్మపల్లెలో సోమవారం రాత్రి జరిగిన జంట హత్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బాధితుడు వెంకటరాయుడు భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బస్సు–టెంపో లారీ ఢీ



టెంపో లారీని ఢీకొన్న అనంతరం రోడ్డుమీద ఆగిపోయిన బస్సు

సిద్దవటం : మండలం లోని మాధవరం–1 బస్టాండ్ వద్ద మంగళవారం పులివెందుల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు చెన్నై నుంచి పులివెందులకు వెళుతోంది. మహారాష్ట్రకు చెందిన టెంపో లారీ రాజంపేట వైపు నుంచి కడపకు వెళుతోంది. ఈ క్రమంలో మాధవరం–1 బస్టాండ్ వద్ద ముందు వెళుతున్న టెంపో లారీని పులివెందుల బస్సు వెనక వైపు ఢీకొంది. బస్సులో ఉన్న ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు ప్రమాదంలో బస్సు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి పెన్నానదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ చిరంజీవి మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు 30–35 మధ్య ఉంటుందన్నారు. మృతుడు వేసుకున్న బనియన్‌పై జూనియర్ ఎన్‌టీఆర్ బొమ్మ ఉందన్నారు. ఎడమ చేతిపై శివపార్వతుల పచ్చబొట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్ఆర్‌సీపీలోకి వలసల వెల్లువ

పుల్లంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దళవాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిన్న మస్తాన్, గారాలమడుగు సర్పంచ్ షేక్ మహ్మద్ అలీతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అనేక పథకాలు ప్రజలకు అందజేశారని, శ మరలా జగనన్న ముఖ్యమంత్రి అయితే పేద ప్రజలతోపాటు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అందుకోసం పార్టీలో చేరామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో తమకు గుర్తింపు లేకపోవడంతో తాము వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, బోదనపు చిన్న ఖాదర్ వల్లి, బోదనపు రసూల్, బోదనపు మౌలాలి, కలకట్ల చిన్నబాబు, కలకట్ల పెద్దబాబు, జేఏసీ కన్వీనర్ హరినాథరెడ్డి, బోదనపు సిద్దు, బోదనపు రంజాన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ చిన్న మస్తాన్, అనుచరులతో కొల్లం గంగిరెడ్డి



పార్టీలో చేరిన కోనాపురం వాసులతో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిన కోనాపురం వాసులు

రాజంపేట రూరల్ : నందలూరు మండలం కోనాపురంలో టీడీపీకి చెందినవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఆకేపాటి భవన్(వైఎస్సార్‌సీపీ కార్యాలయం)లో నందలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వై విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విచ్చేసిన కోనాపురం వాసులకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వెలకచెర్ల బాబు, వెలకచెర్ల బుజ్జయ్య, వెలకచెర్ల జయరాం, వెలకచెర్ల బుజ్జి, వెలకచెర్ల రామయ్య, వెలకచెర్ల రాజు, వెలకచెర్ల అశోక్, వెలకచెర్ల బట్టు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఏపీఐఐసీ డైరెక్టర్ తంబెల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, గోపీరెడ్డి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, నాగా శేఖర్‌రెడ్డి, పెంచలయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం మేడా భవన్‌లో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారి నుద్దేశించి ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా సుపరిపాలన అందించారన్నారు. అందువల్లనే వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నుంచి వలసలు రోజురోజుకు అధికమయ్యాయన్నారు. మళ్లీ వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారందరూ కష్టపడి ఈ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నందలూరు మండలపార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్ర, పొత్తపి ఎంపీటీసీ మోదుగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బలిజపల్లె, నూకినేనిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎన్నికల పరిశీలకుడు పీసీ యోగీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గడికోట వెంకటసుబ్బారెడ్డి, మాజీ కన్వీనరు సిద్ధవరం గోపిరెడ్డి , స్థానిక బీసీనేత చింతకాయలపల్లె గంగినాయుడు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలను కప్పుతున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

పురుగుల మందు తాగి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

మదనపల్లె : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటరమణ(53) మూడు నెలలుగా మతిస్థిమితం బాగోలేక ఇబ్బంది పడుతున్నాడు. మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మానసికవ్యాధి వైద్యుడి వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటివద్దనే ఉన్న వెంకటరమణ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చాలా సేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు వెంకటరమణను ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయచోటికి చేరుకున్న ఎన్నికల పరిశీలకుడు నవాజ్ అహమ్మద్



ఎన్నికల పరిశీలకుడు దిల్ నవాజ్ అహమ్మద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ బి. కృష్ణారావు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా సార్వత్రిక ఎన్నికల పరిశీలకుడు దిల్ నవాజ్ అహమ్మద్ ఐపీఎస్‌కు అన్నమయ్య జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు స్వాగతం పలికారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శాంతిభద్రతల పరిశీలన కోసం మంగళవారం జిల్లా కేంద్రమైన రాయచోటికి ఆయన చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లాలో ఎన్నికల నిర్వహణ అంశాలపై ఎస్పీని అడిగి ఆయన తెలుసుకున్నారు. శాంతియుత వాతావరణంలో ఓటు వినియోగించు కొనే విధంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అందుకోసం 89779 46222కు ఫోన్ చేయాలని సూచించారు.

ఇవ్వాల్సిన డబ్బు అడిగినందుకు కొడవలితో దాడి

మదనపల్లె : ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తి కొడవలితో దాడిచేసి నలుగురిని తీవ్రంగా గాయపరిచి, సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసిన ఘటన కురబలకోట మండలం తుమ్మచెట్లపల్లెలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు(63), మహదేవమ్మ(55) భార్యాభర్తలు. వీరికి కుమారుడు గోపాలకృష్ణ(30), మనవడు లక్ష్మీచైతన్య(12) ఉన్నారు. శ్రీనివాసులుకు పెద్దనాన్న కుమారుడు అయిన రమణ, గతంలో జరిగిన ఓ వివాదానికి సంబంధించి కోర్టు ఖర్చుల కోసం రెండేళ్ల క్రితం వదిన అయిన మహదేవమ్మ నుంచి రూ.2,70,000 నగదు, బంగారు చైను తీసుకున్నాడు. పలుమార్లు డబ్బు విషయం అడిగితే రమణ పట్టించుకోకపోగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పేవాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం కుదువపెట్టిన చైన్‌ను తీసుకువచ్చి మహదేవమ్మకు అప్పగించి, తిరిగి ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి ఆమె తన చైన్ ఎందుకు ఇవ్వాలని అడిగితే, వారిపై రమణ తిరగబడ్డాడు. మాటా మాటా పెరిగి పట్టరాని ఆవేశంతో కొడవలి తీసుకుని, మహదేవమ్మ చేతిమీద, అన్న శ్రీనివాసులు తలమీద, వరుసకు కుమారుడైన గోపాలకృష్ణ, మనవడైన లక్ష్మీచైతన్యపై రమణతో పాటు ఆయన కుటుంబసభ్యులు దాడిచేశారు. గొడవను పోలీసులకు చెప్పేందుకు సెల్‌ఫోన్ తీసుకుని ఫోన్ చేసేలోపు కొడవలితో సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన మహదేవమ్మ, శ్రీనివాసులు

భక్తి శ్రద్ధలతో త్రేతేశ్వరుడికి గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మండల పరిధిలోని అత్తిరాలలో సోమవారం రాత్రి గిరిప్రదక్షణను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. ముందుగా బహుదానదికి గంగా హారతి ఇచ్చారు. ఈ హారతి సమయంలో పట్టణంలోని ఎర్రబల్లికి చెందిన భక్తులు కటారు లక్ష్మీదేవి, నాగిరెడ్డి దంపతులు కామాక్షి మాతకు చీరె సారె అందించారు. హారతి అనంతరం హరహర మహదేవ శంభోశంకర అని స్మరణ చేస్తూ చేపట్టిన ఈ గిరి ప్రదక్షణతో అత్తిరాల పరిసరాలలో శివనామస్మరణ హోరెత్తింది. కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేక పల్లకిలో కొలువు దీర్చారు. స్వామి వారి పల్లకిని భక్తులు మోస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన ఈ ప్రదక్షణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది. గిరి ప్రదక్షణ చేసిన భక్తులకు గిరి ప్రదక్షిణ భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతినిధులు అన్నప్రసాదం అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రదక్షణ కమిటి అధ్యక్షులు సిద్దా లింగారెడ్డి, కార్యదర్శి పోకల ప్రభాకర్, కోశాధికారి వై. నందకిషోర్‌గౌడ్, కమిటీ సభ్యులు యాపీ రాయుడు, బాలక్రిష్ణారెడ్డి, రాఘవరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేయడానికి వచ్చిన భక్తులు

‘విజయవాణి’ విద్యార్థుల ప్రతిభ



జి.వైష్ణవి జి.చర్మిళ ఎం.రిషిత ఎం.కార్తీక్ ఎం.గణేష్

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా) : చౌడపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి ప్రైవేటు విద్యాసంస్థల్లో పదోతరగతి ఫలితాల్లో 99.10 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విజయవాణి సంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి తెలిపారు. పాఠశాలలో మొత్తం 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 110 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. కాగా వీరిలో జి.వైష్ణవి 583 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు జి. చర్మిళ 577 మార్కులు, ఎం రిషిత 572 మార్కులు, ఎం.కార్తీక్ 571మార్కులు, ఎం.గణేష్ 571 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించాని చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ జ్యోతి రాణి, హెడ్‌మిస్టర్ కరుణ, ఆకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

వైభవం.. గంధోత్సవం



విద్యుద్దీప వెలుగుల్లో దర్గా



ఖవ్వాలీ ఆలపిస్తున్న గాయకులు

కమలాపురం: కమలాపురంలో పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిర్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్-ఏ-నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఉరుసు మహోత్సవాల్లో భాగంగామంగళవారం రాత్రి గంధోత్సవం అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామాగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధాన్ని ఊరేగించారు. కర్ణాటక నుంచి వచ్చిన డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేస్తూ స్వామి పట్ల ఉన్న భక్తిని ప్రదర్శించారు. గంధోత్సవం ఊరేగింపు తాళం, మార్కెట్, చౌక్ సెంటర్ మీదుగా దర్గా చేరుకుంది. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు. అనంతరం భక్తులందరికి పంచి పెట్టారు.

ఆశ్చర్యపరిచిన ఫకీర్ల విన్యాసాలు

గంధోత్సవం ఊరేగింపులో ఫకీర్లు చేసిన విన్యాసాలు అలరించాయి. ఊరేగింపు చౌక్ సెంటర్‌కు చేరుకోగానే మేళ తాళాల మధ్య వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫకీర్లు దబ్బళాలను నాలుక, తల, కను రెప్పలు, చెవులు, చేతి కండరాలు, బుగ్గల్లోకి గుచ్చుకొని చేసిన విన్యాసాలు గగుర్పొడిచాయి. తలలోకి పెద్ద ఇనుప కడ్డీని గుచ్చుకొని దానిపై టెంకాయలు పగులగొట్టి అబ్బుర పరిచారు. ఈ విన్యాసాలను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

అలరించిన ఖవ్వాలి పోటీ

ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకొని దర్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీం సాబిరి, ముంబయికి చెందిన కలీం నయీమ్ ల మధ్య రాత్రంతా ఖవ్వాలీ పోటీ పోటాపోటీగా సాగింది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఖవ్వాలీ ప్రియులు ఆద్యంతం ఉత్సాహంగా తిలకించారు. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా ఉరుసు మహోత్సవాలకు తరలివచ్చారు. స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతిని కలిసి ఆశీర్వాదం పొందారు.

అరటితోట దగ్ధం

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి కొత్తపల్లెలో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ వల్ల అరటి తోట దగ్ధమైంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన సోమన్న తన పొలంలో అరటి పంట సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల సుమారు ఎకరాకు పైగా అరటితోట దగ్ధమైంది. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక రైతులు ఫైర్‌స్టేషన్ అధికారులకు తెలియజేయగా వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.



షార్ట్‌సర్క్యూట్ వల్ల దగ్ధమైన అరటితోట

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండిలా..

- టెన్త్ విద్యార్థులకు ఈనెల 30 వరకు అవకాశం
- అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూలు విడుదల
- మే 24 నుంచి పరీక్షలు



మదనపల్లె సిటీ : పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్న వారు పునః మూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్‌ఎంలకు మాత్రమే ఫీజు చెల్లించాలి:

ఈ ఏడాది పది పరీక్షలు రాసిన విద్యార్థులు పాసైనా/ఫెయిలైనా పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్ / రీ కౌంటింగ్ కోసం మంగళవారం నుంచి ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్ /రీ కౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జవాబుపత్రాల రీ కౌంటింగ్ /రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌ఎంకి మాత్రమే ఫీజును సమర్పించాలి. అన్ని రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేయాలి. సీఎఫ్‌ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు ఆమోదించరు.

ముఖ్య సూచనలు:

అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు అటెస్టేషన్ చేయించి, సంబంధిత విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. నేరుగా విజయవాడలోని డీజీఈ కార్యాలయం (ఎస్ఎస్‌సీ బోర్డు)కు పంపించరాదు. దరఖాస్తులు పోస్టు ద్వారా స్వీకరించరు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికి మార్కులు వచ్చాయా లేదా అని ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసి విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి కూడుతారు. తప్పుగా కూడి ఉంటే సరి చేసి మార్కులు వేస్తారు. అంతేగాని పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ దరఖాస్తు ఇలా...

మే 24వ తేదీ నుంచి జూన్ 3 వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల టైంటేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. వచ్చే నెలలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులకు ప్రతి పాఠశాల హెచ్‌ఎం/ సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఈఓలు ఆదేశాలు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో చెల్లించాలి

చెల్లించాల్సిన ఫీజులను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంల లాగిన్ ద్వారా చెల్లించాలి. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలి. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలి. – పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె



ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామంలో మంగళవారం శ్రీ వీరాంజనేయస్వామి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మజ్జిగ పంపిణీ చేశారు. ఉత్సాహంగా జరిగిన బండ పందెం పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి (రూ. 50 వేలు) ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన కోటేశ్వరరావు ఎద్దులు, ద్వితీయ బహుమతి (రూ. 30 వేలు) కాశినాయన మండలం అనుమారుపల్లెకు చెందిన శీలం జగన్మోహన్‌రెడ్డి, తృతీయ బహుమతి (రూ. 20 వేలు) బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన రామయ్య, చతుర్థ బహుమతి (రూ. 10 వేలు) ప్రకాశం జిల్లా సత్యవోలుకు చెందిన బాలరాజు ఎద్దులు గెలుచుకున్నాయి. ఎద్దుల బండపందెం పోటీలు చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ పోటీలను పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి ప్రారంభించారు.